వినోదన్నకే పట్టం కడుదాం

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ మానస, మహిళా నేతలు

- భారీ మెజార్టీతో గెలిపించుకొని పార్లమెంట్‌కు పంపుదాం
- ఎంపీపీ మానస, జడ్పీటీసీలు విజయ, లక్ష్మణ్‌రావు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

గంభీరావుపేట, ఏప్రిల్ 26: ఎంపీగా పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించిన బోయినపల్లి వినోద్‌కుమార్‌కే తిరిగి పట్టం కడుదామని జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ పిలుపునిచ్చారు. గోరంటాలలో శుక్రవారం కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా జడ్పీటీసీ ఇంటింటా ప్రచారం చేశారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రగతిని వివరిస్తూ, వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మరోసారి పార్లమెంట్‌కు పంపుదామని పిలుపునిచ్చారు. ఇక్కడ ఎంపీటీసీ ఎర్రం అంజిరెడ్డి, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, కొలుముల బాల్‌రెడ్డి, సురేందర్ ఉన్నారు.

కరీంనగర్‌పై గులాబీజెండా ఎగరాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరవేద్దామని ఎంపీపీ పడిగెల మానస పిలుపునిచ్చారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు.

ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మోర నిర్మల, మాజీ సర్పంచ్ కోడం సంధ్యారాణి, సద్ద రోజా ఉన్నారు.

వినోద్‌కుమార్‌కే మొగ్గు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: అన్ని గ్రామాల్లో ప్రజలు వినోద్‌కుమార్ వైపే మొగ్గు చూపుతున్నారని జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు కొనియాడారు. శుక్రవారం ఆయన హరిదాస్‌నగర్, పోతిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. పార్లమెంట్‌లో ప్రజాగొంతుకను వినిపించడంలో వినోద్‌కుమార్ తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు సుధాకర్‌రావు, పిల్లి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పోతిరెడ్డిపల్లిలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: గోరంటాలలో వినోద్‌కు మద్దతుగా ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీటీసీ విజయ

▲ మృతి చెందిన నేతన్నల ఫొటోలను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్, నాయకులు

నేత కార్మికులవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

- కక్షపూరితంగానే బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేత
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్26: సిరిసిల్లలో ఉపాధి లేక అకాల మరణం చెందిన నేతన్నలవి ఆత్మహత్యలు కావని.. అవి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇందులో భాగంగానే బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లను నిలిపివేసిందన్నారు. దీంతో ఉపాధి లేక సిరిసిల్ల నేతన్నలు రోడ్డునపడే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో సిరిసిల్లకు బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ వస్త్రాల తయారీ ఆర్డర్లను అందించారని కొనియాడారు. కేటీఆర్ ఆలోచనతో ఉరిసిల్లగా ఉన్న సిరిసిల్ల సిరుల ఖిల్లాగా వర్ధిల్లిందన్నారు. కార్మికుడిని యజమాని చేయాలన్న లక్ష్యంతో వర్క్ టూ ఓనర్, నేతన్న బీమా, త్రిఫ్ట్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. దీంతో గత ఎన్నికల్లో సిరిసిల్ల నేతన్నలంతా కేటీఆర్‌కు మద్దతుగా నిలిచారని, దీనిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. పదేండ్లుగా సుభిక్షంగా వర్ధిల్లిన కార్మిక క్షేత్రంలో తిరిగి ఆత్మహత్యలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. రేవంత్‌రెడ్డి మార్పు తెస్తామని అధికారంలోకి వస్తే.. ఏం మార్పు చేస్తాడో అనుకున్నామని.. పదేండ్ల క్రితం నాటి ఆకలి చావులు మళ్లీ తెస్తాడని అనుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నేత కార్మికులకు ఆత్మగౌరవం కల్పిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నేతన్నలపై కక్షపూరిత ధోరణిని మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్, పట్టణాధ్యక్షుడు ఎస్‌కే బాబా, జిందం రాహుల్, కనుకుంట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 26: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్డీవో సంపత్‌రావు సూచించారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట్, దరూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 137 కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు 1.63 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రంలో పేరు నమోదు చేసుకునే సమయంలో ఆధార్‌కార్డు, పట్టాపాసు పుస్తకం, బ్యాంక్‌ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారం, విద్యాసాగర్, వీవోఏలు, కమిటీ సభ్యులు, రైతులు, కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సెకండ్ ర్యాండమైజేషన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రక్రియను కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా పర్యవేక్షించారు. సాఫ్ట్‌వేర్ పనితీరు.. పోలింగ్ సిబ్బంది అలాట్మెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ సిబ్బందిని సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేశామన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఓపీఓలను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అలాట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరికి ఎన్నికల విధులపై శిక్షణ త్వరలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, కరీంనగర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, పూజారి గౌతమి, ట్రెయినీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీఐవో శివరాములు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 26: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి ఉచిత క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో 14ఏండ్ల పైబడిన ఆసక్తి గల బాలబాలికల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్లారెడ్డిపేట స్టేషన్లలో ఈ నెల 29లోగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 1 నుంచి 31 వరకు ఉదయం 6 నుంచి 8గంటల వరకు రెండు గంటలపాటు వాలీబాల్, కబడ్డీ, పెయింటింగ్, అబకాస్, కరాటే, యోగా, ఆర్చరీ, డ్యాన్స్, అథ్లెటిక్స్, కుండల తయారీ, మార్షల్ ఆర్ట్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో..

కలెక్టరేట్, ఏప్రిల్ 26: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలతో యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో భాగంగా మే 1 నుంచి 31వరకు 14ఏండ్ల లోపు బాలబాలికలకు కరాటే, యోగా, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్‌బాల్, విలువిద్య (ఆర్చరీ), కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ఉదయం 6నుంచి 8వరకు, సాయంత్రం 5నుంచి 7గంటల వరకు పట్టణంలోని రాజీవ‌నగర్ మినీ స్టేడియంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే సీనియర్, జాతీయ క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల కోసం ఈ నెల 29లోగా కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో (రూమ్ నంబర్ 19లో గల జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కార్యాలయం) దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లలో (9059465889, 7569207411) సంప్రదించాలన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

వేములవాడ, ఏప్రిల్ 26: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ, కోనరావుపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను బాలబాలికల వినియోగిం చుకోవాలని డీఎస్పీ నాగేంద్రాచారి సూచించారు. శిబిరాల్లో వాలీబాల్, కబడ్డీ, కరాటే, యోగా, డ్యాన్స్, అథ్లెటిక్స్, అబాకస్, పెయింటింగ్ నేర్పిస్తామని, ఆసక్తి గలవారు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 1నుంచి 31వరకు ఉచిత శిక్షణ అందిస్తామని చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ రేపు పర్యటన

కార్పొరేషన్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 28న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న ఉదయం 11 గంటలకు వేములవాడ టౌన్‌లోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో వేములవాడ నియోజకవర్గ బూత్ స్థాయి, మధ్యాహ్నం 2గంటలకు మానకొండూర్ నియోజకవర్గంలోని అలుగునూర్ చౌరస్తా వద్ద లక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాల్‌లో, సాయంత్రం 4గంటలకు కరీంనగర్‌లోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో బూత్ కమిటీ స్థాయి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో భారీ రోడ్ షోలో పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేములవాడ పట్టణ సీఐగా వీరప్రసాద్

వేములవాడ, ఏప్రిల్ 26: వేములవాడ పట్టణ సీఐగా బీ వీరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 30న సీఐ కరుణాకర్ బదిలీ కాగా, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా ఇన్ని రోజులు కొనసాగారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ సీఐగా పని చేస్తున్న సీఐ వీరప్రసాద్‌ను వేములవాడ పట్టణ సీఐగా అటాచ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేయగా, శుక్రవారం ఆయ న విధుల్లో చేరారు.

కేటీఆర్ రోడ్ షో సక్సెస్

కోనరావుపేట, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన రోడ్ షో సక్సెస్ కావడంతో శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామన్న ప్రసంగంతో కార్యకర్తలు, యువకుల్లో జోష్ నింపింది. రోడ్ షోకు తరలివచ్చిన మహిళలు, నాయకులు, కార్యకర్తలకు ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో మే 13న కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26: పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్, శ్రీనగర్‌కాలనీ, ధోబీగల్లి, అంబేద్కర్‌నగర్, సిద్ధార్థనగర్, పోచమ్మ వీధి, మార్కండేయ వీధి, భావనరుషినగర్, విద్యానగర్‌లో ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సత్తా చాటిన విద్యార్థులు

గంభీరావుపేట, ఏప్రిల్ 26: మల్లారెడ్డిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఐదో తరగతికి ఆయా గురుకుల విద్యాలయాల్లో అర్హత సాధించారని హెచ్‌ఎం మరాఠి అజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు మహ్మద్ జోహ ఫిర్దోసి, హృతిక, మునీశ్వర్, యశ్వంత్, హర్షిత్ ప్రవేశ పరీక్ష రాసి, గురుకుల విద్యాలయాలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

₹50వేలకు మించి తీసుకెళ్లొద్దు

వేములవాడ రూరల్: తిప్పాపూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- తిప్పాపూర్‌లో వాహనాల తనిఖీ
- ప్రభుత్వ పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా ₹50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని, ఒకవేళ తీసుకెళ్తే సరైన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. నాకాబందీలో భాగంగా గురువారం పట్టణంలోని తిప్పాపూర్ బస్టాం డ్ వద్ద ఏర్పాటు చేసిన తనిఖీల్లో ఆయన పా ల్గొని, మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, నగదు, మాదకద్రవ్యాలు సరఫరా కాకుండా తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను డీఎస్పీ నాగేంద్రాచారి, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్‌తో కలిసి పరిశీలించారు.

నిబంధనలు పాటించాల్సిందే..

తెలంగాణ చౌక్, ఏప్రిల్26: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. నెల రోజులుగా జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై నమోదు చేసిన కేసుల వివరాలను శుక్రవారం ప్రకటన ద్వారా వెల్లడించారు. మైనర్లకు వాహనాలు ఇస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రిపుల్ రైడింగ్‌లో 159మందికి జరిమానా విధించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేసేవారిపై 23, వాహనాలకు డబుల్ సైలెన్సర్లు బిగించి శబ్దకాలుష్యానికి గురి చేస్తున్న 27వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు వెల్లడించారు.

చందుర్తిలో ₹53వేలు పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 26: మండల కేంద్రానికి చెందిన సాయివంశీ ఆధారాలు లేకుండా ₹53వేలు వేములవాడకు తీసుకెళ్తుండగా, మర్రిగడ్డ శివారులో సోమవారం పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సీజ్ చేసిన నగదును ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఆయన చెప్పారు.

వడదెబ్బతో వలస కూలీ మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: వడదెబ్బతో వలస కూలీ మృతిచెందిన ఘటన వేములవాడ రూరల్ మండలం అచ్చనపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్‌కు చెందిన శంకర్‌సదా(33) అచ్చనపల్లిలోని కొనుగోలు కేంద్రంలో పని చేసేందుకు వారం క్రితం వచ్చాడు. ఈ క్రమంలో కూలీ పని చేస్తుండగా వడదెబ్బ తగలి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే దవాఖానలకు తరలించగా, అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపారు.

సిద్ధోగానికి రావాలని ఆహ్వానం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: వట్టెంల గ్రామంలో జరిగే రేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు రావాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి అహ్వానం అందజేశారు. అనంతరం డీఎస్పీ నాగేంద్రచారిని వారు కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

కారు బైక్ ఢీకొని.. విశాంత్ర ఉద్యోగి మృతి

సాయిలు (ఫైల్)

ముస్తాబాద్, ఏప్రిల్ 26: ముస్తాబాద్-సిద్దిపేట ప్రధాన రాహదారిపై కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్‌కు చెందిన అబ్రవేణి సాయిలు (62) గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందాడు. సాయిలు శుక్రవారం ద్విచక్ర వాహనంపై ముస్తాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తుండగా, వెంకయ్యకుంట సమీపంలో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సిద్దిపేటలోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందాడని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్న ఆలయంలో రద్దీ

స్వామివారి దర్శనం కోసం క్యూలో నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 26: వేసవి సెలవుల సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం రద్దీగా కనిపించింది. ధర్మగుండంలో పవిత్రస్నానాలు చేసి, భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించుకుని, బెల్లాన్ని పంచిపెట్టి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్నను 10వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, సుమారు ₹13లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు.

నోటీసులిచ్చినా.. చెట్లు కొడుతున్నరు?

బోయినపల్లి, ఏప్రిల్ 26: కోరెంలో రహదారి పక్కన ఉన్న హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సెస్, గ్రామ పంచాయతీ తీర్మానం లేనిదే కొట్టవద్దని జీపీ కార్యదర్శి నోటీసులిస్తున్నా.. వారు పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. నెల రోజుల క్రితం కోరెం సబ్‌స్టేషన్ నుంచి బూర్గుపల్లి గ్రానైట్‌కు వరకు విద్యుత్ స్తంభాలు వేసి, తీగలు లాగే పనులను సెస్ అధికారులు ప్రారంభించగా, తమ పంటపొలాలు చెడిపోతాయని, హరితహారం చెట్లు లేకుండాపోతాయని సదరు పనులు చేయవద్దని కోరెం రైతులు, గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. జీపీ అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేసే పనులు ప్రారంభించవద్దని సెస్ ఏఈఈకి గత మార్చి 2న కోరెం సెక్రటరీ నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ 20రోజుల క్రితం తర్వాత సెస్ అధికారులు కోరెం రహదారి పక్కన చెట్లను కొట్టి విద్యుత్ తీగలు లాగారు. ఈ విషయమై కార్యదర్శిని ఎంపీడీవో జయశీల వివరణ తీసుకోగా, ఇప్పటికే నోటీసు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో గత మంగళవారం మళ్లీ విద్యుత్ అధికారులు చెట్లను కొట్టివేయగా, కార్యదర్శి వారికి మరోసారి నోటీసులు ఇచ్చి రూ.9,544 జరిమానా విధించారు. రెండు శాఖల మధ్యన సమన్వయం లేకపోవడంతోనే చెట్లను కొడుతున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా, మరోసారి అనుమతి లేకుండా హరితహారం చెట్లను కొడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 26: మండల కేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. శ్రీరామనవమిని మొదలుకుని పది రోజులపాటు ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో శేష హోమం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, బలిహరణం, నాగవల్లి, సప్తవర్ణాలు, ఏకాంతసేవ, తీర్థ ప్రసాద వితరణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కులబహిష్కరణ చేస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: వ్యక్తులు, కుటుంబాలను ఎవరైనా బహిష్కరణ చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల పలు గ్రామాల నుంచి కుల బహిష్కరణపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. కులబహిష్కరణ పేరిట వ్యక్తులు, కుటుంబాలను మానసిక వేదింపులకు గురిచేస్తే కుల సంఘం పెద్దలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

రుద్రంగి, ఏప్రిల్ 26: మండల కేంద్రానికి చెందిన సింగం అంజయ్య అల్లుడు బండ రంజిత్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేత సామ మోహన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కొంత నగదుతోపాటు నిత్యావసర సరుకులు అందించారు. ఇక్కడ నేతలు సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్, మహేశ్, తదితరులు ఉన్నారు.

పుస్తెమట్టెలు పంపిణీ

వీర్నపల్లి, ఏప్రిల్26: సీతారాంనాయక్‌తండాకు చెందిన బానోత్ రమేశ్ కుమార్తె అర్చన వివాహం శుక్రవారం జరిగింది. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమట్టెలను వధువు తల్లిదండ్రులకు అందజేశారు. ఇక్కడ డెయిరీ అధ్యక్షుడు రాజేందర్, సూపర్‌వైజర్ నాగరాజు, మాజీ సర్పంచ్ రవినాయక్, ఎంపీటీసీ పద్మ ఉన్నారు.

ప్రమాదకరంగా ధాన్యం కుప్పలు

పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులపై పోసిన వరి ధాన్యం కుప్పలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ధాన్యం కుప్పలను రాత్రిపూట ఢీకొని గతంలో పలువురు సైతం మృతి చెందారు. ఈ క్రమంలో గొల్లపల్లిలో వలసకూలీగా ఉంటున్న సుబ్బారావు రాజన్నపేట వైపు నుంచి గొల్లపల్లి వైపు వస్తున్న క్రమంలో వరి కుప్పను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు జరిగిన ఘటనలను సీరియస్‌గా తీసుకుని రోడ్డుపై ధాన్యం పోస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు. ధాన్యం ఎండబోసేందుకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని రైతులు కోరుతున్నారు.

- ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26

గొల్లపల్లి-రాజన్నపేట రహదారిపై పోసిన వరి ధాన్యం కుప్పలు